క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ హయాంలోనే అభివృద్ధి



వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ మురళీకృష్ణారావు

బొబ్బిలి: వైఎస్సార్‌ సీపీ హయాంలోనే బొబ్బిలి మున్సిపల్‌ వార్డుల్లో అభివృద్ధి పనులు ఎక్కువగా జరుగుతున్నాయని మున్సిపల్‌ చైర్మన్‌ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ఐదో వార్డులో పర్యటించిన ఆయన అక్కడి ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు పథకాలు, మౌలిక సదుపాయాలు విరివిగా అందుతున్నాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్‌ వెలగాడ హైమావతి, వైఎస్సార్‌ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌ మామిడి చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్‌



మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా రెండో అదనపు జడ్జి దామోదరరావు

బొబ్బిలి: స్థానిక సీనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టులో ఈ నెల 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెండో అదనపు జడ్జి ఎస్‌.దామోదరరావు తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవాదులతో సమావేశమైన ఆయన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిగే ఈ కార్యక్రమంలో రాజీకావడానికి అవకాశం ఉన్న కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి టి.వాసుదేవన్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు జి.శర్మ, టి.దామోదర్‌ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులను ఉద్దేశించి, మాట్లాడుతున్న మోటివేషనల్‌ ట్రైనీ శ్రీదేవి

రాజాం: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సారధి వాసవీ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ మోటివేషనల్‌ ట్రైనీ పొట్నూ శ్రీదేవి తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని సారధిలో ఉన్న జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్‌ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక సంసిద్ధత అవసరమని అన్నారు. నీతికథల పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇవి ఓర్పు, సహనం మంచి నడవడికకు ఊతమిస్తాయన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగి, మెరుగైన సమాజ నిర్మాణానికి తమ వంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సారధి వాసవీక్లబ్‌ ఇంటర్నేషనల్‌ అధ్యక్షురాలు పి.గాయత్రి, పాఠశాల హెచ్‌ఎం బి.మాధురి పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులంతా నేత్రదానానికి ముందుకురావాలని, నేత్రదానం చేయండి.. ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని నినాదాలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్‌ ఎ.జనార్దనరావు మాట్లాడుతూ నేత్రదానం ఎంతో గొప్పదని, నేత్రదానానికి యువతీయువకులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్‌ అధికారి ఎస్‌.వసంతరావు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్‌కు స్థల పరిశీలన

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామ శ్మశానవాటిక వద్ద అమృత్‌ వాటర్‌ ట్యాంకు నిర్మాణానికి మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. పట్టణానికి సంబంధించి, రెండు చోట్ల ఈ ట్యాంకులు నిర్మించనున్నామన్నారు. ఇప్పటికే ఒకదానికి స్థల పరిశీలన చేయగా, మరొక వాటర్‌ ట్యాంక్‌ ఏర్పాటుకు స్థలపరిశీలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్‌, సచివాలయ వీఆర్వో సువర్ణ, వైఎస్సార్‌ సీపీ నాయకులు శాసపు వేణుగోపాలనాయుడు, ఆర్‌.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రామభద్రపురం: కొండకెంగువలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రాజాం: లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కుళాయిలు వేయాలని, రేషన్‌ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేయగా, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అందరూ బాగుండాలన్నదే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే ఆయన అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలుచేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం గ్రామంలోని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్‌ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ డబ్ల్యూఎస్‌ రాయులు, వైస్‌ ఎంపీపీ బెల్లాన ప్రసాద్‌, మండల జేసీఎస్‌ కన్వీనర్‌ చింతల సింహాచలంనాయుడు, సచివాలయ కన్వీనర్‌ బెవర ప్రసాదరావు, తహసీల్దార్‌ రాజారావు, సీఎస్‌డీటీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ది రామరాజ్య పాలన: ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిది రామరాజ్య పాలన అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని పొగిరి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందజేస్తున్నారని, ఇది యావత్తు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సుల మేరకు ఆ పార్టీ కార్యకర్తలకే దక్కేవన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. కోవిడ్‌ విపత్తు సమయంలో ఇవే పథకాలు ప్రజలకు ఆర్థిక ఇబ్బందుల లేకుండా చేశాయని, అప్పుడు దేశమంతా రాష్ట్రం వైపు చూసిందన్నారు. మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు.

ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తూ వారి ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ వారు తమ మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాగే ఎక్కడికక్కడ దాడులకు ఎగబడుతున్నారని, రాష్ట్ర ప్రజలంతా వారి ఆగడాలను గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, సర్పంచ్‌ పొగిరి కృష్ణవేణి, వైఎస్సార్‌ సీపీ రూరల్‌ కన్వీనర్‌ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్‌ ఎంపీపీ యాలాల వెంకటేష్‌, జేసీఎస్‌ కన్వీనర్‌ కామోదుల శ్రీరంగనాయుడు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయండి



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్యారోగ్య, ఐసీడీఎస్‌, విద్యాశాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన కార్యక్రమంపై వలంటీర్లు ముందుగా ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరు ఏయే వ్యాధులు, జ్వరాలతో బాధపడుతున్నారో వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఎంఈవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పీహెచ్‌సీ వైద్యులతో మండల ప్రత్యేకాధికారి ఎం.యశోధరరావు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏవో రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

రామభద్రపురంలో డెంగీ కేసు నమోదు

రామభద్రపురం: స్థానిక మహంతి వీధికి చెందిన కర్రి సూర్యనారాయణ డెంగీ వ్యాధి బారినపడ్డాడు. జ్వరంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 7వ తేదీన రక్తపరీక్ష చేయించుకోగా డెంగీ సోకినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. దీంతో అతడిని మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండింది..

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాపం ఇన్నాళ్లకు పండిందని, ఒక్కొక్కటిగా అతడు చేసిన ఆర్థిక నేరాలు బయటపడుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 ఏళ్ల మధ్యకాలంలో చాలా అవినీతి జరిగినట్లు ఐటీ శాఖ వెల్లడించిందన్నారు. హైదరాబాద్‌లోని సెంట్రల్‌ సర్కిల్‌ ఇన్‌కాం ట్యాక్స్‌ చంద్రబాబుది రూ.118.98 కోట్ల అవినీతి సొమ్ముగా పేర్కొని, నోటీసులు ఇచ్చిందన్నారు. ఈ డబ్బు కేవలం ఒక ఆర్థిక సంవత్సరానికి సంబంధించిందని, ఇదే విషయం వారి ఈ మెయిల్స్‌, వాట్సాప్‌ చాట్‌లలో కూడా రికార్డు అయ్యిందన్నారు. ఐటీ శాఖ మనోజ్‌ వాసుదేవ్‌ పార్థసాని అనే షాపూర్జీ–పల్లోంజి ప్రతినిధిపై దృష్టిసారించి, తీగ లాగితే డొంక మొత్తం కదిలిందన్నారు. ఈ మనోజ్‌ వాసుదేవ్‌ ప్రధానంగా చంద్రబాబుకి ఎల్‌అండ్‌టీ లంచాలు చేరవేయడంలో సూత్రధారి, పాత్రధారి అని, చంద్రబాబు హయాంలో ఇలాంటి అక్రమ లావాదేవీలు ఎన్నో జరిగి ఉంటాయని ఆరోపించారు. 2019 ఫిబ్రవరిలో ఎంపీపీ తన కంపెనీ అనుమతి తీసుకుని, అందులో ప్రత్యేకంగా ఎండీ సుభోద్‌ దీక్షిత్‌ అనుమతితో చంద్రబాబుకు ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇవి వైఎస్సార్‌ సీపీ చేసిన ఆరోపణలు కాదని, సాక్షాత్తు ఐటీ శాఖ 2023 ఆగస్టు 4వ తేదీన జారీచేసిన షోకాజ్‌ నోటీసుల సారాంశమన్నారు. నిరుపేదల గృహాలను కూడా చంద్రబాబు వదల్లేదని, రూ.8 వేల కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులను కూడా షాపూర్జీ పల్లోంజీకి అందించారన్నారు. అక్రమ ముడుపుల నగదు బదిలీకి కోడ్‌ భాషను చంద్రబాబు వినియోగించారని వివరించారు. అక్రమార్జనలో అడ్డంగా దొరికిన చంద్రబాబు దొంగే కాబట్టి అతడిని శిక్షించాలని డిమాండ్‌ చేశారు. అతనికి సపోర్ట్‌ చేసిన పత్రికాధిపతులు, యాక్టర్లు కూడా దొంగలే కాబట్టి వారికి ఎంతెంత డబ్బులు ఇచ్చారన్నది కూడా లెక్కతేల్చాలని పట్టుబట్టారు. లోకేష్‌ యువగళం యాత్ర పూర్తిగా వివాదాల యాత్రగా మారిందన్నారు. ఈ యాత్రలో రెడ్‌ టీషర్ట్‌లు వేసుకుని, టీడీపీ రౌడీలు వస్తున్నారని, ఈ సంఘ విద్రోహులు పోలీసులుపై దాడులు చేస్తున్నారని, ప్రజలను గాయపరుస్తున్నారన్నారు. భీమవరంలో మరో పుంగనూరు ఘటన పునరావృతమయ్యేలా చేసి, ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారని విమర్శించారు. యాత్రల పేరుతో తండ్రీకొడుకులు రాష్ట్రంలో విధ్వంసాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర భద్రతకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ఆయన వెంట పార్టీ రాజాం టౌన్‌ కన్వీనర్‌ పి.శ్రీనివాసరావు, ఎల్‌.రాజగోపాలనాయుడు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



తెర్లాం: కొరటాంలో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టి, అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ వెంకటలక్ష్మి

తెర్లాం: ప్రతిఒక్కరికీ పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్‌ బాడంగి ప్రాజెక్ట్‌ పరిధిలోని తెర్లాం, లోచర్ల సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కొరటాం, అరసబలగ గ్రామాల్లో పౌష్టికాహార ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతిరోజూ పౌష్టికాహారం తినాలని తెలిపారు.

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రత్నకుమారి మాట్లాడుతూ వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

రేగిడి: మాతాశిశు మరణాల నివారణే ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్య శాఖ రీజనల్‌ ట్రైనింగ్‌ ప్రోగ్రాం అధికారి మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశమైన ఆయన గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వారి కోసం కిల్కారీ పేరిట వాయిస్‌ మెసేజ్‌ల కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు.

పైపులైన్లను పరిశీలించిన జెడ్పీటీసీ

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామ కూరాకుల వీధి సమీపంలో లీకేజీకి గురైన తాగునీటి పైపులైన్లను జెడ్పీటీసీ బండి నర్సింహులు శుక్రవారం పరిశీలించారు. లీకులను అరికట్టి, సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామని గ్రామస్తులకు జెడ్పీటీసీ హామీ ఇచ్చారు.

అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు

రామభద్రపురం: మండల, గ్రామస్థాయి అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎన్‌.గోవిందరావు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమామణితో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయాలని తెలిపారు. మన గ్రామం, మన మండలం అని అందరూ అనుకుంటేనే అభివృద్ధికి అందరి సహకారం ఉంటుందన్నారు. మండలంలో ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులకే అందేలా చూడాలన్నారు.

వంగరలో అసిస్టెంట్‌ కలెక్టర్‌ పర్యటన



శివ్వాం అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో అసిస్టెంట్‌ కలెక్టర్‌ సహదిత్‌ వెంకట్‌

వంగర: మండల కేంద్రంలో అసిస్టెంట్‌ కలెక్టర్‌ సహదిత్‌ వెంకట్‌ శుక్రవారం పర్యటించారు. తొలుత తహసీల్దార్‌ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శివ్వాంలోని అంగన్‌వాడీ–1, 2 కేంద్రాలను సందర్శించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీస్కూల్‌ నిర్వహణపై ఆరాతీశారు. అయితే ఇద్దరు చిన్నారుల బరువు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన ఆయన విజయనగరంలోని న్యూట్రీషియన్‌ రిహేబిలిటేషన్‌ సెంటర్‌(ఎన్‌ఆర్‌సీ)కి పంపించాలని సూచించారు. అక్కడ చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాజాం ఐసీడీఎస్‌ పీవో కనగదుర్గ, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్‌ సుష్మిత దయాన్‌ తదితరులు పాల్గొన్నారు.

'శ్రావణ' శోభ



రాజాం సిటీ: గాయత్రీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: ఉంగరాడమెట్ట వేంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు



బొబ్బిలి: పూలందుకున్న, దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి: స్థానిక దాడితల్లి ఆలయం, సంతోషి మాత, లలితాదేవి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు తమ ఇష్టదైవానికి విశేష పూజలు చేసి, సామూహిక వ్రతాలు ఆచరించారు. దీంతో ఆలయాల్లో శ్రావణ శోభ సంతరించుకుంది.

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆలయాల్లో శ్రావణమాస పూజలు శుక్రవారం నిర్వహించారు. వేకువజాము నుంచే బస్టాండ్‌ ఆవరణలోని నవదుర్గ ఆలయంతో పాటు గాయత్రి కాలనీలోని గాయత్రిదేవి ఆలయానికి చేరుకున్న మహిళలు పెద్దఎత్తున కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేమకోటి తిరుమలశర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకమ పూజలు చేశారు. అందరూ సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని అమ్మవార్లను భక్తులు వేడుకున్నారు.

కృష్ణాష్టమి సందడి



రాజాం: శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మార్వాడీలు



బొబ్బిలి: శ్రీకృష్ణుని పల్లకి మోస్తున్న డీఎస్పీ శ్రీధర్‌ దంపతులు

రాజాం: స్థానిక పట్టణంలోని ఠాణా, సారధి, కాలెపు వీధులతో పాటు వాసవీనగర్‌ తదితర ప్రాంతాల్లో కృష్ణాష్టమి సందడి నెలకొంది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణానికి చెందిన మార్వాడీలు శ్రీకృష్ణుడి విగ్రహంతో తిరువీధి నిర్వహించారు. ఈ క్రమంలో భక్తులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.

బొబ్బిలి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని శుక్రవారం ఊరేగించారు. ప్రబోధ సేవా సమితి బొబ్బిలి కమిటీ అధ్యక్షుడు సీహెచ్‌ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ పుల్లూరు శ్రీధర్‌ దంపతులు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛను వచ్చెను.. ఆనందించెను..

కొత్త పింఛన్‌దారుల్లో నూతనోత్సాహం నెలకొంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో కొత్త పింఛన్ల పంపిణీ శుక్రవారం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి, లబ్ధిదారులకు పింఛన్‌ నగదు అందజేశారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అందిస్తుండగా, అర్హులై ఉండి, ఇంకా ఎవరైనా ప్రభుత్వ పథకాలు పొందని వారుంటే అలాంటి వారి కోసం ఇటీవల జగనన్న సర్కారు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, పథకాలు అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– సాక్షి నెట్‌వర్క్‌.



తెర్లాం: వెలగవలసలో టీడీపీ కార్యకర్త దాలయ్యకు కొత్తగా మంజూరైన పింఛన్‌ అందజేస్తున్న సర్పంచ్‌ ఫల్గుణరావు



బొబ్బిలి: పెంట గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న పీఏసీఎస్‌ అధ్యక్షుడు అప్పలనాయుడు



వంగరలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



మెంటాడ: కొత్త వారికి పింఛన్లు అందిస్తున్న వైస్‌ ఎంపీపీ ఈశ్వరరావు